జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
శుక్రవారం | 1 | ఆగస్టు | 2025 ◆ పేజీలు : 6



# పారదర్శకంగా నిబంధనలకు లోబడి లేఔట్ అనుమతులు జారీ

- ఎఫ్.టి.ఎల్. బఫర్ జోన్ లలో అనుమతులు ఇవ్వరాదు
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన లేఔట్ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

2 లో...




## పిల్లలను మణిరత్నాలుగా
# తీర్చిదిద్దడమే లక్ష్యం

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- 8 నుంచి ఇంటర్ వరకు చదివే ఆడ పిల్లలకు సైకిల్స్ పంపిణీ
- 5 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- 470 కోట్లతో పాలేరు నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి చర్యలు
- కూసుమంచి జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన, విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ, కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన మంత్రి పొంగులేటి

**పాలేరు ఆర్సీ, జూలై 31, ప్రజాజ్యోతి :** ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, కష్టాలు ఉన్నా పిల్లలను మణి రత్నాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి గురువారం కూసుమంచిలో పర్యటించి 5 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, జిల్లా పరిషత్ హైస్కూల్ లో పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిళ్ల పంపిణీ, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కూసుమంచి మండలంలో 5 కోట్ల 50 లక్షలతో జూనియర్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడమే కాకుండా, డిసెంబర్ చివరి వరకు పనులు పూర్తి చేసి జూనియర్ కళాశాలను ఈ సంవత్సరంలోనే ప్రారంభిస్తామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 8 నుంచి 10వ తరగతి చదివే ఆడ పిల్లలకు గత సంవత్సరం సైకిళ్ళను పంపిణీ చేశామని అన్నారు. ప్రస్తుతం 8వ తరగతి వచ్చిన విద్యార్ధినులకు సైకిళ్ళు పంపిణీ

మిగతా 2 లో...



# జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి ఎలా ఉంది

- పెండింగ్ లో ఉన్న హైవే విస్తరణ పనుల పూర్తికి తీసుకుంటున్న చర్యలేంటి
- ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా ఇచ్చిన కనెక్షన్లు ఎన్ని
- 2020 నుంచి చిన్న పరిశ్రమల మూసివేతకు కారణాలను గుర్తించారా

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** స్థానిక తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాల్లో జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి ఎలా ఉంది అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం మూడు అంశాలపై ప్రశ్నించారు. జాతీయ రహదారులతో పాటు ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయువై ) కనెక్షన్లు, సూక్ష్మ మరియు మధ్యస్థ పరిశ్రమల మూసివేతకు కారణాల పై ప్రశ్నించారు.కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి

మిగతా 2 లో...



# సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి ప్రణాళికలు

- ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం తరుణీ హాట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి

రాష్ట్ర రెవెన్యూ,హౌజింగ్,సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2 లో..



# ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు

- ప్రజలు సామాజిక బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- జ్వరం లక్షణాలు ఉంటే ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి
- కూసుమంచి మండలం కేంద్రంలోని, ఆయుర్వేద, యునానీ, హోమియో ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

2 లో..

## జాతీయ రహదారుల నిర్మాణ పురోగతి ఎలా ఉంది

(మొదటి పేజీ తరువాయి...)

నితిన్ గడ్కరీ, పెట్రోలియం మరియు సహజ వాయువుల శాఖల సహాయ మంత్రి సురేష్ గోపి,సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే లు వేరువేరుగా లిఖిత పూర్వక సమాధానాలు ఇచ్చారు.జాతీయ రహదారులకు సంబంధించి సంబంధిత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ భారత్ మాల పరియోజనలో భాగంగా 2017లో దేశవ్యాప్తంగా 34,800కి.మీ.జాతీయ రహదారుల నిర్మాణాన్ని రూ. 5.35 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.ఇందులో 20,070 కి.మీ ఇప్పటికే నిర్మించినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 1,719 కి. మీ. మేరా నిర్మాణాలకు గాను 874 కి.మీ.పూర్తయినట్లు చెప్పారు.భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్నిచోట్లా సకాలంలో పూర్తి చేస్తామని వివరించారు.ప్రధానమంత్రి ఉజ్వల యోజన ( పీఎంయువై) పురోగతిపై కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి సమాధానమిస్తూ పేద వయోజన మహిళలకు డిపాజిట్ రహిత ఎల్ పీ జీ కనెక్షన్లను అందించే లక్ష్యంతో 2016 లో ప్రారంభించామని, 8 కోట్ల కనెక్షన్ల లక్ష్యాన్ని సెప్టెంబర్ లో సాధించామని తెలిపారు.మిగిలిన అర్హులైన పేదల కోసం 2021లో చేపట్టిన ఉజ్వల 2.0 ద్వారా 2022 డిసెంబర్ లో 1.60 కోట్ల కనెక్షన్ లక్ష్యాన్ని సాధించినట్లు చెప్పారు.దేశవ్యాప్తంగా ఈ నెల ఒకటో తేదీ నాటి గణాంకల ప్రకారం 10.33 కోట్ల పీఎంయువై కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు.గ్రామీణ,మారుమూల ప్రాంతాల్లోని మహిళలు కట్టెల పొయ్యిని వీడేలా చేసి,శ్వాసకోశ ఇబ్బందులను దూరం చేసి,జీవితాల్లో ఈ పథకం గణనీయ ప్రభావం చూపిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో 2019-20 లో 1,48,480 కనెక్షన్లు,ఉజ్వల 2.0 కింద 2023-24 లో 32,890, ఈ ఏడాది ఇప్పటివరకు 336 కనెక్షన్లు మంజూరు చేసినట్లు వివరించారు.సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరండ్లజే సమాధానం ఇస్తూ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల ( ఎంఎస్ఎంఈ ) రిజిస్ట్రేషన్ పోర్టల్ 2020లో ప్రారంభమైనట్లు తెలిపారు.పరిశ్రమలు, సంస్థల ద్వారా..దేశవ్యాప్తంగా 28.49కోట్ల మంది ఉపాధి,ఉద్యోగ అవకాశాలు పొందారని, తెలంగాణకు సంబంధించి 2020-21 లో 1.63 లక్షల మంది, 2025-26కు సంబంధించి 1.23 లక్షల మంది ఉన్నట్లు గణాంకాలు తెలిపారు.జిడిపిలో ఎగుమతి వాటా 2023 -24 లో 45. 73 శాతం ఉందని, నకిలీ రిజిస్ట్రేషన్,కంపెనీ యజమాని మార్పు..తదితర కారణాలతో 0.15 శాతం చిన్న తరహా పరిశ్రమలు మూతపడినట్లు వివరించారు.

## ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు.

**పాలేరు ఆర్సీ జూలై31 ప్రజా జ్యోతి:** ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు పని చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కూసుమంచి మండలం కేంద్రంలోని ఆయుర్వేద, యునానీ, హోమియో ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ.పి. సేవలు, మందుల అందుబాటు, సూచిక బోర్డు, వైద్య సేవలు, ల్యాబ్ రికార్డ్స్, మెడికల్ ఫార్మసి, ప్రసూతి కాన్పుల గది, అపరేషన్ థియేటర్ పరిశీలించారు. డాక్టర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డాక్టర్లు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. రోజుకు ఎన్ని ఓ.పి. లను చూస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యం పై సమగ్రంగా వివరాలు తెలిపి మందులు వాడే పద్ధతిని వివరించాలని, వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. గర్భిణిల కాన్పుల గదిలో కావాల్సిన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించి, ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు దృష్టి పెట్టాలని వైద్యులకు సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల, ఆవరణంలో పిచ్చి మొక్కలు, చెత్త లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను అదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, తదితర వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా కేసులు తప్పనిసరిగా రిపోర్ట్ అయ్యేలా చూడాలని తెలిపారు.ఆసుపత్రిలో అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వవైద్యకేంద్రాలపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే సేవల నాణ్యతతో పాటు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కావలసిన పరికరాలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై నివేదికల సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, వైద్యాధికారులు డా. సాయికుమార్, డా. లక్ష్మిలోహిత, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# పిల్లలను మణిరత్నాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం.

(మొదటి పేజీ తరువాయి...)

చేస్తున్నామని అన్నారు. ప్రతి సంవత్సరం 8 నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు సైకిల్స్ అందిస్తానని అన్నారు. విద్యారంగంలో కాస్త వెనుకబడి ఉన్న పాలేరు నియోజకవర్గాన్ని విద్య పట్ల అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. గత 20 నెలల కాలంలో 470 కోట్ల రూపాయలను విద్యా రంగంలో పాలేరు నియోజకవర్గానికి మంజూరు చేశామని అన్నారు. 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులం, 208 కోట్లతో జే.ఎన్.టి.యూ. ఇంజనీరింగ్ కాలేజీ, 46 కోట్లతో ఐటిఐ కళాశాల, 5.5కోట్ల జూనియర్ కళాశాల, తిరుమలాయపాలెం హాస్టల్ 2కోట్ల 70లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచామని అన్నారు. హైదరాబాద్ సమీపంలో అభివృద్ధి చేస్తున్న ఫోర్త్ సిటీ లో పిల్లలకు నైపుణ్యం నేర్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నామని



అన్నారు. ఆర్థికంగా ఎన్ని కష్టాలు ఉన్న పేద పిల్లలను మణి రత్నాలుగా తీర్చిదిద్దుతామని అన్నారు. పిల్లలకు ప్రభుత్వం సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తుందని అన్నారు. పాఠశాలలో 3 కంప్యూటర్ ట్రైనింగ్ ట్యూటర్ లను నియమించేందుకు 3 లక్షల నిధులు మంత్రి మంజూరు చేశారు. పాఠశాల కాంపౌండ్ వాల్ తో పాటు పాఠశాలకు ఆదాయం వచ్చేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేస్తుందని, ఇందులో భాగంగా జూనియర్ కళాశాలను 5 నెలల కాలంలో పూర్తి చేయాలని మంత్రివర్యులు ఆదేశించారని, డిసెంబర్ చివరి నాటికి పాఠశాల ఎదురుగా జూనియర్ కళాశాలను సిద్ధం చేస్తామని అన్నారు. ప్రస్తుత స్కూల్ లో 177 మంది విద్యార్థులు 10వ తరగతి చదువుతున్నారని, ఇక్కడ జూనియర్ కళాశాల రావడం చాలా సంతోషకరమని అన్నారు. పాఠశాలకు రెగ్యులర్ గా వచ్చేందుకు ఆడపిల్లలకు దోహదపడేలా మంత్రివర్యులు ట్రస్ట్ ద్వారా సైకిళ్ళు పంపిణీ చేస్తున్నారని అన్నారు. చదువు మించిన ఆస్తి మరోకటి లేదని, చదువు ఉంటే జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. పీఎం శ్రీ క్రింద ఈ పాఠశాలను ఎంపిక చేసి ల్యాబ్, ఏఐ టూల్స్ ద్వారా విద్యా బోధన వంటి అనేక సౌకర్యాలను కల్పించామని, పిల్లలు ఈ సదుపాయాలను వినియోగించుకుంటూ బాగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కూసుమంచి మండలానికి చెందిన 75 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు సైకిళ్లను అందజేసి మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ స్కూల్ ఆవరణలో సైకిల్ నడిపి పిల్లల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి ప్రణాళికలు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంత్రి వర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం తరుణీ హాట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ స్థలాన్ని మొత్తం పరిశీలించారు.సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ డ్రాఫ్ట్ ప్లాన్ వివరాలను ఆర్ అండ్ బీ అధికారులు, జిల్లా కలెక్టర్ ల నుంచి మంత్రివర్యులు తెలుసుకొని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ స్థలం పూర్తి స్థాయిలో చదును చేయాలని అన్నారు.ఈ స్థలంలో పాతబడిన, అనవసరమైన నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగించాలని మంత్రి



సూచించారు.మండల స్థాయిలో ప్రజల సౌకర్యార్థం అన్ని కార్యాలయాలు ఒకే చోట అన్ని వసతులతో ఉండే విధంగా నిర్మించాలని, దీనికి తగిన విధంగా ప్రణాళికలు, డిజైన్ తయారు చేయాలని మంత్రి ఆదేశించారు.మండల స్థాయిలో తహసిల్దార్,ఎంపిడిఓ, సబ్ రిజిస్ట్రార్,వ్యవసాయ శాఖ మొదలగు అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండేలా సముదాయం ఉండాలని అన్నారు.మండల కార్యాలయం నిర్మించిన తర్వాత నిర్వహణ కూడా సక్రమంగా జరిగేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని మంత్రి సూచించారు. అంతర్గంగా 30 ఫీట్ల రోడ్డు వేసేలా ప్లాన్ చేసుకోవాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ సూచనలు పాటిస్తూ నిర్మాణాలు జరగాలని అన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మండల కార్యాలయ సముదాయం అవసరమైన విద్యుత్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు సమకూర్చుకునేలా ప్లాన్ లో భాగస్వామ్యం చేయాలని అన్నారు.సమీకృత మండల కార్యాలయ సముదాయం వద్ద అవసరమైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు.మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా త్రాగు నీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫ్లోర్ లో ప్రజల వెయిటింగ్ ఏరియా ఉండాలని,అక్కడ త్రాగు నీటి ట్యాప్ ఉండాలని అన్నారు.కార్యాలయాల్లో ఫైల్స్ పెట్టెందుకు స్టోరేజ్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు,ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఏ.శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండల తహసిల్దార్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా నిబంధనలకు లోబడి లేఔట్ అనుమతులు జారీ

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక పారదర్శకంగా నిబంధనలకు లోబడి లేఔట్ అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం నిర్వహించిన లేఔట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు.పెండింగ్ ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, ప్రతి లే అవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఉన్న దరఖాస్తుల ప్రాంతాలను గూగుల్ ఎర్త్ వినియోగిస్తూ కలెక్టర్ గతంలో అక్కడ ఏమైనా నీటి వనరులు ఉన్నాయా వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ★జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ లేఔట్ అనుమతులు మంజూరు చేసే సమయంలో నియమ, నిబంధనలు క్షేత్ర స్థాయిలో అనుసరించేలా చూడాలని అన్నారు. నిబంధనల మేరకు ఓపెన్ స్పేస్ తప్పని సరిగా లేఔట్ ఏరియాలో ఉండాలని,లేఔట్ లో గ్రీనరీ చెట్ల పెంపకానికి కేటాయింపులు జరగాలని అన్నారు. లేఔట్ కు అప్రోచ్ రోడ్డు,అంతర్గత రోడ్లు ఉండాలని అన్నారు.లేఔట్ లో స్ట్రీట్ లైట్స్, సీవరేజి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, ఫైర్ సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు.లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ లలో అనుమతులు జారీ చేయడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు.లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు ఉన్నాయా అని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా సాంకేతికతను వినియోగిస్తూ పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని,నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని, మనం జారీ చేసిన అనుమతుల లోని నిబంధనలను అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారా లేదా రెగ్యులర్ పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు.లేఔట్ లకు డ్రాఫ్ట్ అనుమతులు జారీ చేసిన తర్వాత విద్యుత్ స్తంభాల తరలింపు కోసం ఎన్.పి.డి.సి.ఎల్ డిమాండ్ నోటీస్ అందించాలని, వారం రోజుల వ్యవధిలోగా చెల్లింపులు పూర్తి చేయాలని లేని పక్షంలో డ్రాఫ్ట్ అనుమతులు ఉపసంహరించాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ డెవలపర్లు విద్యుత్ స్తంభాల తరలింపుకై చెల్లింపులు చేసిన వారం రోజుల వ్యవధిలోగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని, దీనిపై ప్రత్యేకంగా ఎన్.పి.డి.సి.ఎల్ ఎస్.ఈ కు లేఖ రాయాలని అన్నారు. విద్యుత్ స్తంభాల తరలింపు ఆలస్యం కావడం వల్ల లేఔట్ తుది అనుమతులు జారీ పెండింగ్ లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. డి.ఎల్.సి కమిటీ లో ఉన్న ఎస్.ఈ. స్థాయి అధికారులు స్వయంగా ధృవీకరించిన డాక్యుమెంట్స్ మాత్రమే సమావేశానికి తీసుకొని రావాలని అన్నారు.ఖమ్మం జిల్లాలో ఇక నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి డి.ఎల్.సి. సమావేశం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్డీసి ఎం.రాజేశ్వరి, సుడా సిపిఓ.పంచాయతీ రాజ్ ఈ.ఈ.మహేష్, ఏదులాపురం మునిసిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్,ఇరిగేషన్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్,సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ మండలంలో సొసైటీలను తనిఖీ చేసిన జేడీఏ పుల్లయ్య

**తల్లాడ, జులై 31 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడ మండల పరిధిలోని పరిధిలోని గంగదేవిపాడు, తల్లాడ ప్రాథమిక వ్యవసాయం సహకార పరపతి సంఘంలో యూరియా అమ్మకాలను జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య మండల వ్యవసాయ అధికారి ఎండి తాజుద్దీన్ తో కలిసి గురువారం తనిఖీ చేశారు. సొసైటీల పరిధిలో గల యూరియా నిల్వలను, స్టాక్ రిజిస్టర్లను , స్టాక్ బోర్డుల ను మరియు అమ్మకాల



కు సంబంధించిన బిల్ బుక్స్ ను పరిశీలించారు. యూరియా ప్రతి ఒక్క రైతుకి అందే విధంగా సమయానుసారంగా రైతులకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యూరియా పంపిణీ జరిగేల చూడాలని ఆదేశించారూ. రైతులు తో మాట్లాడుతూ దశల వారీ గా సరిపడా యూరియా అందు బాటు లో ఉంటుంది అని రైతులు ఎ లాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని అవసరం అయినంత మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ ఈ ఓ లు హసీనా, మాధవి, మురళి, శివకుమా ర్, సాయి సొసైటీ సీఈవో నాగబాబు, రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోట రాంబాబు



**బోనకల్, జూలై 31,(ప్రజాజ్యోతి ):** మండల పరిధిలోని రావినూతల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు శంకుస్థాపన చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో పేదవాడి సొంతింటి కల నెరవేరుతుంది అని,వారి కళ్ళల్లో ఆ ఆనందం కనిపిస్తుంది అని రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్కకి,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసి మెంబర్ ఉమ్మినేని కృష్ణ, గ్రామ అధ్యక్షుడు తాళ్లూరి రవి,చేబ్రోలు వెంకటేశ్వర్లు, బంధం తిరుపతిరావు,బోయినపల్లి మురళి,భద్రు నాయక్,మోదుగుల నాగేశ్వరరావు, తాళ్లూరి ఆరోను,షేక్ కరీం,బూసిపోగు వెంకటి,రూప్లా నాయక్,చిలక శివ, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## షైన్ హై స్కూల్ లో ఘనంగా నిర్వహించిన గ్రీన్ డే సెలెబ్రేషన్స్

- ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత



**బోనకల్,జూలై 31,(ప్రజాజ్యోతి) :** స్థానిక షైన్ హై స్కూల్ లో గ్రీన్ డే సంబరాలు అంబరాన్ని అంటాయి.చిన్నారులు ఆట,పాటలతో పాఠశాల వాతావరణం పండుగలా మారింది,విద్యార్థులకు ప్రకృతిని పరిరక్షించే విధంగా ఎలా ఉండాలో చెబుతూ మొక్కలు నాటించారు.ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించే విధంగా నీటిని వృధా చేయకుండా ఉండటం,ప్లాస్టిక్ నివారణ,చెట్లను నరకకుండా ఉండటం,చెత్త కుండీలు వాడటం,పరిసరాల శుభ్రత మొదలగు అంశాల మీద పూర్తి స్థాయి అవగాహనా పాఠశాలలో ఇస్తున్నాం అని తెలిపారు..విద్యార్థులను, ఉపాధ్యాయులను కరెస్పాండంట్ అన్సార్ పాషా,ప్రిన్సిపాల్ శ్వేత అభినందించారు.ఈ కార్యక్రమం లో విద్యార్థులతో పాటు పాఠశాల కరెస్పాండంట్ అన్సార్ పాషా, డైరెక్టర్ లాల్ మియా, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూని అరికట్టవచ్చు

- చంద్రు తండా పర్యటించిన డిఎం అండ్ హెచ్ఓ కళావతి



**తిరుమలాయపాలెం, జూలై 31, ప్రజా జ్యోతి:** ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాధికి కారణమైన దోమలని అరికట్ట వచ్చని ఖమ్మం డిఎంఅండ్ హెచ్ఓ కళావతి అన్నారు. డెంగ్యూ కేసులు నమోదైన నేపథ్యంలో డిఎం అండ్ హెచ్ఓ చంద్రు తండా గ్రామాన్ని గురువారం సందర్శించారు. గత వారం రోజులుగా గ్రామంలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్లేడ్ పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బి. వసుంధర నుంచి ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన డిఎం అండ్ హెచ్ఓ... జ్వరంతో బాధపడుతున్న వారందరికీ రక్త నమూనాలు సేకరించాలని అలాగే గ్రామంలో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ట్యాంకుల క్లోరినేషన్, వాటర్ లీకేజీలను సమీక్షించాలని, వర్షాకాలంలో ప్రజలు కాచి, వడకట్టి చల్లార్చిన నీటినే సేవించాలని సూచించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీపీవో దుర్గ, డాక్టర్ బి.వసుంధర, ఏ ఎం ఓ వెంకటేశ్వర్లు, హెచ్ ఈ ఓ వెంకట్ రెడ్డి, సూపర్వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర



**సత్తుపల్లి ఆర్.సి.జూలై31(ప్రజా జ్యోతి):** కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కాలంలో మృతి చెందిన పలు కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు ను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, నివాస గృహాలకు వెళ్ళి పరామర్శించి ఓదార్చారు.వెంకటాపురం గ్రామంలో వినుకొండ సుశీలమ్మ ఇటీవల మృతి చెందగా సుశీలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తాళ్లూరు గ్రామంలో మట్టా హనుమంతరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు.పెద్దకొరుకోండి గ్రామంలో కోమటి రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వెంకటాపురం గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు దుర్గయ్య కిడ్నీ సంబంధిత సమస్య తో బాధపడుతుండగా వారి నివాస గృహానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శించి త్వరగా కోలుకోవాలని కాంక్షించారు.పోచవరం ఎస్సీ కాలనీలో జరిగిన దశదిన కార్యక్రమంలో సండ్ర పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఆయా కార్యక్రమాలలో మాజీ జెడ్పీటీసి సభ్యులు కట్టా అజయ్ కుమార్ , పోచవరం సొసైటీ చైర్మన్ నర్వనేని అంజయ్య, చింతలపూడి బారిస్టర్, తాళ్లూరి శ్రీనివాసరావు, రాఘవరావు , గోపాల్ మరియు ఆయా గ్రామ శాఖల బి అర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నిక

- నియామక పత్రాలు అందించిన మురళి మోజేష్





**తల్లాడ, జులై 31 (ప్రజాజ్యోతి న్యూస్):** ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఐడి కార్డు డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ వైస్ ప్రెసిడెంట్ టి. మురళి మోజేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన శంఖవరపు సత్యనారాయణను రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడిగా, పల్నాడు జిల్లాకు చెందిన మంకెన మోహన్ బాబుని రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మురళి మోజేష్ వారికి నియామక పత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ హక్కుల పరిరక్షణ కోసం నూతన సభ్యులు కృషి చేయాలని సూచించారు. తమకు అవకాశం కల్పించినందుకు నూతనంగా ఎంపికైన సత్యనారాయణ, మోహన్ బాబు పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని కమిటీలు వేసి అభివృద్ధి చేస్తామని వారు తెలిపారు.

## అజయ్ ని పరామర్శించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు అడపా అనిల్ చౌదరి



**తల్లాడ, జులై 31 (ప్రజా జ్యోతి న్యూస్) :** తల్లాడ మండలంలోని తెలగవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన మండల ఉపాధ్యక్షులు వారాల అజయ్ జ్వరంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం నాయకులు, యువనేత అడపా అనిల్ చౌదరి గురువారం అజయ్ ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు స్థానికులు ఉ న్నారు.

## గుండ్ల రాకేష్ కు నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య





**తల్లాడ, జులై 31 (ప్రజా జ్యోతి న్యూస్):** షటిల్ ఆడుతూ ఆకస్మికంగా గుండె పోటుతో మృతి చెందిన తల్లాడకు చెందిన గుండ్ల రాకేష్ కుటుంబాన్ని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పరామర్శించారు. గురువారం రాకేష్ దశదిన కర్మ తల్లాడలో నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి సండ్ర వెంకట వీరయ్య హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు దంపతులను ఆయన ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని అభయం ఇచ్చారు. అనంతరం రాకేష్ ను ఖననం చేసిన ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు జివిఆర్, నాయకుడు దగ్గుల శ్రీనివాస్ రెడ్డి, పెరిక నాగేశ్వరరావు, గుండ్ల నాగయ్య, కోడూరు వీర కృష్ణ, రఘు తదితరులు ఉన్నారు.

## నూతన గృహప్రవేశం చేసిన మంత్రి పొంగులేటి దంపతులు





**సత్తుపల్లి ఆర్. సి.జూలై31(ప్రజా జ్యోతి)** :కల్లూరు మండలం నారాయణపు రం గ్రామం లోని స్వస్థలంలో తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బంధుమిత్రుల కుటుంబ సభ్యుల సమక్షంలో వేద మంత్రాలు ఉచ్చరణ నడుమున గురువారం ఉదయం నూతన గృహ ప్రవేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సతీమణి మాధురి, సోదరుడు ప్రసాద్ రెడ్డి, భార్య లక్ష్మి, అక్క బావ, మేనకోడలు బంధువులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఊటుకూరు రంజిత్ ఆధ్వర్యంలో రామకృష్ణకు మంత్రి పొంగులేటి ఆర్థిక సాయం అందజేత



**తల్లాడ(వైరా), జూలై 31 (ప్రజాజ్యోతి న్యూస్):** కొని జర్ల మండలంలోని పెద్దగోపతి గ్రామపంచాయతీ పరిధిలోని అనంతా రం గ్రామానికి చెందిన సీతారామకృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఊటుకూరు రంజిత్ కుమార్ గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి పొంగులేటి వెంటనే ఆ కుటుంబానికి 5000 రూపాయలను ఆర్థిక సాయంగా అందించారు. ఈ సందర్భంగా మంత్రికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అంగన్వాడి కేంద్రాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెయ్యాలి

- మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలను కార్పొరేట్ ప్లే స్కూళ్ల మాదిరిగా మార్చే లక్ష్యంతో మౌలిక వసతులను కల్పిస్తూ మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇందులో భాగంగా 6వ డివిజన్‌లోని రస్తోజి నగర్ అంగన్వాడి కేంద్రాన్ని కమిషనర్ గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్స్, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆటవస్తువులు,భద్రతా పరంగా తీసుకున్న చర్యలను పరిశీలించారు. టీచర్లతో సమావేశమై పిల్లలకు అందిస్తున్న విద్యా పాఠ్య విషయాలు, సమయానికి సరైన పోషకాహారం అందుతున్నదా అనే అంశాలపై చర్చించారు.పిల్లలకు మరింత అనుకూలమైన వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన సదుపాయాలపై టీచర్ల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. అన్ని అంగన్వాడి కేంద్రాలను అదే తరహాలో అభివృద్ధి చేస్తామని, పిల్లల భవిష్యత్తు మెరుగుదలకు ఇది ఒక చిన్న ప్రయత్నమని కమిషనర్ పేర్కొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**కారేపల్లి,జులై 31, ప్రజా జ్యోతి:** ఎన్నికల టైములో పేదవాడికి ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చాలని ఉద్దేశంతో ఈ ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు పగడాల మంజుల, సింగరేణి మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్‌లు అన్నారు.గురువారం సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుడి గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ సొంతింటి



ని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి,పూర్తి పారదర్శకతతో, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందనీ తెలిపారు. మొదటి విడతగా సింగరేణి మండలంలో 73 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయన్నారు.రెండో విడతలో సైతం అధిక సంఖ్యలో ఇండ్లను మంజూరు చేయించి మండల వ్యాప్తంగా నిరుపేదలను సొంతింటి కలల నిర్మాణానికి తాము చేదోడువాదోడుగా నిలుస్తామని అన్నారు.సింగరేణి మండలంపై వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని అన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని దుర్వినియోగం చేయకుండా ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హనీఫ్,టౌన్ ప్రెసిడెంట్ పోలగాని శ్రీను,గంగరబోయిన సత్యం,చీమలదారి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తప్పవు

- ఎమ్మార్వో ఏ. రమేష్.



**కారేపల్లి,జులై 31, ప్రజా జ్యోతి :** ఇందిరమ్మ ఇండ్ల పేరు చెప్పి మట్టినీ ఇతరులకు అమ్ముకుంటే కఠిన చర్యలు తప్పవని సింగరేణి మండల తహసీల్దార్ ఏ.రమేష్ అన్నారు.గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండ లంలో అనేకచోట్ల అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు తన దృష్టికి వచ్చిం దన్నారు.ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పేరు చెప్పి బయటకి మట్టిని అమ్ముకుంటున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు.మండలంలో ఎక్కడైనా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతే స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తున్నట్టు తెలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామనీ హెచ్చరించారు.

## పండుగ వాతావరణంలో గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల శంఖుస్థాపన కార్యక్రమాలు





**బోనకల్, జూలై 31,(ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని,చిరునోముల, గోవిందాపురం(ఏ)గ్రామాల్లో పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల శంకు స్థాపన కార్యక్రమాలు జరుగుతున్నాయి, ఈకార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి సభ్యులు మోదుగు సుధీర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై వేముల సారిక,నాగరాజ్ ఇంటి కి శంఖుస్థాపన చేశారు,ఇస్రం ప్రభాకర్ కి మంజూరైన ఇందిరమ్మ గృహాలాకి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంఖుస్థాపన చేశారు,పదేళ్లు ఎదురుచూసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లు ఇవ్వలేదని ప్రజా ప్రభుత్వం రాగానే ఇందిరమ్మ గృహా లాను మం జూరు చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి రెవిన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు, మాజీ సర్పంచ్ భాగం శ్రీనివాసరావు,మండల కాంగ్రెస్ నాయకులు భాగం నాగేశ్వరావు,పిల్లలుమర్రి నాగేశ్వరరావు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ తోట జనప్రియ కుమార్ మాజీ ఉపసర్పంచ్ ఆముదాల పుల్లారావు గ్రామ శాఖ అధ్యక్షులు గూడ నరసయ్య శాస్త్రి, భాగం పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- నూతన రేషన్ కార్డులు పంపిణీ చేసిన కార్పొరేటర్ కన్నం వైష్ణవి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక 46వ డివిజన్ పరిధిలోని సారధి నగర్ లోని లబ్ధిదారులకు ప్రభుత్వ చౌక దుకాణం రేషన్ షాప్ నెంబర్ 50 నందు నూతన రేషన్ కార్డులను కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు ఆదేశానుసారం గురువారం డివిజన్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు అందించడం జరిగిందని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజల అవసరాల కు అనుగుణంగా ప్రజారంజకమైన పరిపాలన కొనసాగుతుందని అందులో భాగంగా ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్నటువంటి సమస్యను తీరుస్తూ నూతన రేషన్ కార్డులు అందించడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. ప్రతినెల ప్రతి వ్యక్తికి 6 కిలోల బియ్యం రేషన్ షాపుల ద్వారా అందుతుందని,సన్న బియ్యం అందించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అభిప్రాయపడ్డారు.ఖమ్మం నియోజకవర్గం లో ప్రజా సంక్షేమానికి తుమ్మల నాగేశ్వర రావు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, నగర ఓబీసీ అధ్యక్షుడు బాణాల లక్ష్మణ్, నాయకులు ఏమ్మ రామకృష్ణ,దండా శివరాం, మైస పృధ్వి,నిరంజన్ నాయక్, రేషన్ డీలర్ హైమావతి కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో మహిళ మృతి



**కారేపల్లి, జూలై 31, ప్రజా జ్యోతి:** విద్యుద్ఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన సింగరేణి మండలం విశ్వనాధపల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వనాధపల్లికి చెందిన బొగ్గారపు సరస్వతి(53) ఇంటి రేకుల పందిరిలో కట్టిన జీ వైరు దండెంపై ఆరవేసిన దుస్తులను తీస్తుండగా జీ వైరుకు విద్యుత్ ప్రసరించి విద్యుద్ఘాతంకు గురైంది. షాకు తగిలిన వెంటనే దస్తులను గట్టిగా లాగటంతో జీవైరు ఆవైరు మెడకు చుట్టుకుని తప్పించుకోలేక కుప్పకూలింది. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే విద్యుత్ ప్రసరణ ను నిలిపి వేసి చూడగా అప్పటికే సరస్వతి మృతి చెందింది. మృతురాలికి భర్త బొగ్గారపు కిషన్ రావు, కుమారుడు ఉన్నారు.

# రాజకీయాలకతీతంగా అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

- సిపిఎం పార్టీ మధిర డివిజన్ మడిపల్లి గోపాల్ రావు
- వివిధ గ్రామాల నుంచి ధర్నాలో పాల్గొన్న ప్రజలు
- తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసిన సీపీఎం పార్టీ నాయకులు



**బోనకల్, జూలై 31,(ప్రజా జ్యోతి):** రాజకీయాలకు అతీతంగా అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ గ్రామ కమిటీలకు ఉన్న చట్టబద్ధత ఏమిటని, వారు లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారని, భవిష్యత్‌లోనూ ఇదే పరిస్థితి కొనసాగితే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కార్యక్రమాలను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. గురువారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన వారితో బోనకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ సెంటర్ మీదుగా తాసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ తీశారు. తాసీల్దార్ కార్యాలయం ముందు రెండు గంటల పాటు ధర్నా చేశారు.సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా అధికారులే లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కాంగ్రెస్‌లో ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లకు అర్హులా, ఇతర పార్టీలలో ఉంటే వారు అర్హులు కాదా అని ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్‌కు చెందిన వారికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నారని, ఇదెక్కడి ప్రజాస్వామ్యం అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు, వితంతువులకి, వికలాంగులకు, ఒంటరి మహిళలకు రాజకీయాల పేరుతో ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. పెద్ద పెద్ద ఇల్లు ఉన్న వారికి, పొలాలు, ట్రాక్టర్లు, కార్లు ఉన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు ఎలా ఇస్తారని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మద్దెల రమాదేవి మాట్లాడుతూ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అర్హులైన వారందరికీ ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. మంజూరైన వారిలో అర్హత లేకపోతే విచారణ చేసి తొలగిస్తామన్నారు. తాసీల్దార్ హామీతో ధర్నాను ముగించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారి సురేశ్, జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యుడు పాపినేని రామనరసయ్య, సీనియర్ నాయకుడు చింతలచెరువు కోటేశ్వరరావు, తుళ్లూరు రమేశ్, బంధం శ్రీనివాసరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సునీత, గుడ్డూరి ఉమ, నల్లమోతు వాణి, నోముల వెంకట నరసమ్మ, పసుపులేటి నరేశ్, కందికొండ శ్రీనివాసరావు, కొమ్మినేని నాగేశ్వరరావు, దొండపాడు సత్యనారాయణ, బండి శ్రీనివాసరావు, గుమ్మ ముత్తారావు, గుగులోతు నరేశ్, కోట నాగరాజు, మర్రి తిరుపతిరావు, కొమ్ము కమలమ్మ, యేసుపోగు బాబు, పెద్దప్రోలు కోటేశ్వరరావు, వివిధ గ్రామాల నుంచి ప్రధానంగా తూటికుంట్ల గ్రామం నుంచి పేదలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు యూరియా కొరత లేకుండా చేస్తా... ఏఎంసి దోమా.



**సత్తుపల్లి జూలై31(ప్రజా జ్యోతి):** రైతులకు యూరియా కొరత లేకుండా చేస్తాం అని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమా ఆనంద్ బాబు అన్నారు. మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో సొసైటీ కార్యాలయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఎరువులను, రిజిస్టర్లను తనిఖీ చేసి రైతులకు అనుకూలంగా యూరియాను అందజేస్తామని అన్నారు. శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్,మంత్రుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి రైతులు కోసం ఎటువంటి ఇబ్బంది లేకుండా ఎరువులను అందజేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసమే ఉన్నదని,రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. రైతులతో మాట్లాడి అన్ని అనుకూలంగా అందజేస్తామని తెలియజేశారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్షులు గొర్ల సంజీవరెడ్డి, సొసైటీ సిబ్బంది, రైతులు ఉన్నారు.

# సొసైటీలను తనిఖీ చేసిన వ్యవసాయ శాఖ అధికారులు

- కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్



**పాలేరు ఆర్సీ జూలై31 ప్రజా జ్యోతి:** కూసుమంచి మండలంలోని జక్కేపల్లి పెరికసింగారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్ , మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో యూరియా నిల్వలను ఉంచాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా ఉదయం 7 గంటల నుండి ఎరువులను పంపిణీ చేయాలని సూచించారు . ఎరువుల విక్రయాన్ని పిఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే జరపాలని, రైతు వారీగా యూరియా విక్రయాలను రిజిస్టర్లో నమోదు చేయాలని ,రైతులకు కనపడే విధంగా ఎరువుల నిల్వల వివరాలను తెలుపుతూ స్టాక్ బోర్డును ప్రతిరోజూ ప్రదర్శించాలని తెలియజేశారు. ఎరువుల పంపిణీ విషయంలో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, సొసైటీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



# పోరాటయోధుడు అజ్ఞాత దళ కమాండర్ కామ్రేడ్ పూణెం లింగన్నకు న్యూడెమోక్రసీ నివాళి



**తిరుమలయపాలెం, జూలై 31, ప్రజాజ్యోతి :** ప్రతిఘటన పోరాటయోధుడు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు అజ్ఞాత దళ కమాండర్ కామ్రేడ్ పూణెం లింగన్న 6వ వర్ధంతి సందర్భంగా తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో గురువారం న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో లింగన్నకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి మండల రాజేంద్రప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ లింగన్న తన యవ్వన జీవితం మొత్తం ఆదివాసి హక్కుల కొరకు, పోడు సాగుదారుల కొరకు, దున్నేవాడికే భూమి దక్కాలని నిరంతరం పోరాటం చేసి రాజ్యం చేత హత్యగావించబడి నేటికి ఆరు సంవత్సరాలు పూర్తి అవుతుంది. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ లింగన్నకు ఘనంగా నివాళులర్పిస్తుంది. కామ్రేడ్ లింగన్న నమ్మిన సిద్ధాంతం కొరకు కడవరకు పని చేశారు. దోపిడీ పీడన అణిచివేత లేని సమాజం కొరకు అడవులను అడవిలో ఉన్న ఖనిజ సంపదను కాపాడుతూ కార్పొరేట్ పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా నిలబడి ఉద్యమాన్ని నడిపించినవాడు. కామ్రేడ్ లింగన్నను 2019 జూలై 31న కేసీఆర్ ప్రభుత్వం కర్కషంగా భూటకపు ఎన్కౌంటర్ చేయడం జరిగింది. ఎన్కౌంటర్లు మొత్తం బూటకమేనని నక్సలైట్లను ఏరి పారేస్తామని ఒకపక్క మతోన్మాదాన్ని తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల పేరుతోనే అడవులను జల్లెడ పట్టడం ! మరోపక్క 2026 మార్చి వరకు నక్సలైట్లును ఏరిపారెతెస్తామని చెప్పి అమిత్ షా ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయని భూమి ఉన్నంతకాలం ప్రశ్నించే తత్వం మిగిలి పోతుందని నక్సలిజాన్ని అంతమందించడం ఎవరి తరం కాదని వారు అన్నారు. కామ్రేడ్ లింగన్న ఆశయాలు వారు అందించిన రాజకీయాలు నేటి యువతరానికి ఆదర్శంగా ఉన్నాయని ఆశయ సాధనలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ముందుకు సాగుతున్నదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, గ్రామ కార్యదర్శి ఆడెపు నగేష్, బింగి శ్రీను, సకినాల వెంకన్న, రామకృష్ణ, సంజీవ, ఎన్నబోయిన ఉప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంటల సాగుతో రైతులకు మంచి లాభం ఉంటుంది

- ఆయిల్ పామ్ పంటలను పరిశీలించిన అగ్రికల్చర్ అధికారులు



**పాలేరు ఆర్సీ జులై 31 ప్రజాజ్యోతి:** ఆయిల్ పామ్ పంటల సాగు వల్ల రైతులకు మరింతా ఆదాయం వస్తుందని మాదాపురం గ్రామానికి చెందిన రైతు ముర్తాల కోటి రెడ్డి తెలిపారు. మునిగేపల్లి రెవెన్యూ గ్రామ కోటిరెడ్డి తన ఇరవై ఎకరాల ఆయిల్ ఫామ్ పంట సాగు చేయగా, గురువారం ఆ పంటలను జీళ్ళచెరువు ఏఈవో రవీందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ మెలకువలు, కూలీల కొరత, అధిక పెట్టుబడులు, సమయపాలన లోపాలను అధిగమించడానికి రైతులు ఆయిల్ ఫామ్ పంటను వేసుకోవడం చాలా ఉత్తమమని తెలిపారు. తనకు ఎకరానికి పది టన్నుల చొప్పున ప్రతి ఏడాది పంట దిగుబడి వస్తుందన్నారు. కనీసం 5 ఎకరాల పైన ఉన్న రైతులు అందరూ కూడా ఆలోచన చేసి ఆయిల్ ఫామ్ సాగు చేస్తే రైతుకి పదివేల రూపాయల చొప్పున టన్నుకు ఉన్నా కూడా రైతుకి పెట్టుబడి పోను ఎకరానికి నికరంగా లక్ష రూపాయల వరకు మిగులుతాయన్నారు. కాబట్టి అధిక శ్రమ లేకుండా, అధిక ఆదాయాన్ని కేవలం ఆయిల్ ఫామ్ సాగు ద్వారా పొందవచ్చని రైతు సోదరులందరికీ సూచించడం జరిగింది. తాను ప్రణాళిక ప్రకారంగా ఆల్ఫాం పంటను సాగు చేస్తూ ఆనందంగా ఉన్నానని తెలియజేశారు. కావున వ్యవసాయ శాఖ ద్వారా కోటిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# రాకేష్ కు నివాళులు అర్పించిన తల్లాడ వాలీబాల్ టీం క్లబ్ సభ్యులు..



**తల్లాడ, జులై 31 (ప్రజా జ్యోతి న్యూస్):** ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందిన తల్లాడకు చెందిన యువకుడు, వాలీబాల్, షటిల్ ప్లేయర్ గుండ్ల రాకేష్ కు తల్లాడ వాలీబాల్ కమిటీ ప్రతినిధులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వాలీబాల్ కోర్టు వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేసి రాకేష్ చిత్రపటానికి వాలీబాల్ క్లబ్ అధ్యక్షులు ధరావత్ కృష్ణ, గౌరవాధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు జివిఆర్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ ఈసూబ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాకేష్ వారితో గడిపిన జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. షటిల్ ఆడుతూనే ఒక్కసారిగా కుప్పకూలి మరణించడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ క్లబ్బు టీం సభ్యులు, ప్లేయర్ పాల్గొన్నారు.

## యూపీహెచ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పరిశీలన

- మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ట్రంకు రోడ్డులో నిర్మాణం లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం సందర్శించి,నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా భవన సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించిన కమిషనర్,అక్కడ చెత్తమేటలు ఉన్నందున వాటిని వెంటనే తొలగించి, ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అంతేకాకుండా, ఆ ప్రదేశాన్ని హరిత వాతావరణంగా మార్చే ఉద్దేశ్యంతో పచ్చదనం పెంచేందుకు అందంగా ఉండే మొక్కలను నాటాలన్నారు.కమిషనర్ పర్యటన సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. భవన నిర్మాణ నాణ్యతను పరిశీలిస్తూ,ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్ని అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కమిషనర్ స్పష్టంగా సూచనలు చేశారు.

## ఐ యు ఎం ఎల్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షేక్ బాజీ బాబా నియామకం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షేక్ బాజీ బాబాను రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ షకీల్ నియమించారు. హైదరాబాదులోని రాష్ట్రకార్యాలయంలో ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షేక్ బాజీ బాబాకు నియామక పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ షకీల్ మాట్లాడుతూ,విద్యార్థి నాయకుడిగా పనిచేసిన బాజీ బాబాను ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా నియమించడం జరిగిందని,యువకుడు,ఉత్సాహవంతుడు అందరినీ ఇట్టే కలుపుకొని పోయే మంచి మనసున్న వ్యక్తి, అందరిలో ఒకడిగా చిన్న పెద్ద తారతమ్యాలు లేకుండా అనునిత్యం కలుపుకుని పోయే స్వభావం ఉన్న వ్యక్తి,ప్రస్తుత రాజకీయాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న బాజీ బాబా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీలో చేరటం, కీలక బాధ్యతలు తీసుకోవడం సంతోషకరంగా ఉందన్నారు.ఖమ్మం జిల్లాలో ముస్లిం లీగ్ పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని అదేవిధంగా బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ నిరంతరం పోరాటాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా షేక్ బాజీ బాబా మాట్లాడుతూ, తనను జిల్లా అధ్యక్షుడుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ షకిల్ కు ముందుగా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాని అన్నారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా నన్ను ఎన్నుకున్నందుకు ఎలాంటి అంచనాలకు తాగునీయకుండా పార్టీని విజయోత్సవం దిశగా పరుగులు పెట్టేందుకు నా వంతు కృషి చేస్తానని అందరితో, అందరిలో ఒకడిగా కలిసిమెలిసి ఉంటూ పార్టీని ముందు గెలుపు దిశగా తీసుకెళ్లడమే నా ధ్యేయమని అన్నారు.

## విజ్ఞాన దర్శిని,ఖమ్మం ఆధ్వర్యంలో పి.యం.భార్గవ,సి.సి.యం.బి వ్యవస్థాపకుల సంస్మరణ సభ






**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** స్థానిక కవిత డిగ్రీ మరియు పిజి కళాశాలలో సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ వ్యవస్థాపక శాస్త్రవేత్త వర్థంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ప్రిన్సిపాల్ సి.హెచ్. రాధాకృష్ణ మూర్తి విశిష్ట అతిథిగా పాల్గొని విద్యార్థులు శాస్త్రీయ దృష్టిని అలవరచుకోవాలనని తద్వారా జీవితంలో సైన్స్ యొక్క ఆవశ్యకత నేటి తరం అనుసరించాల్సిన విధానాన్ని వివరించారు.సభాధ్యక్షులు బి.వేదన మాట్లాడుతూ "భార్గవ గారు జ్యోతిష్యాన్ని విశ్వవిద్యాలయం లో ప్రవేశ పెట్టడాన్ని సవాలు చేస్తూ కోర్టు వరకూ వెళ్ళారని,మనం కూడా సమాజంలోని అశాస్త్రీయతను ఖండించాలన్నారు.ప్రధానవక్త కె.విజయలక్ష్మి , రసాయన శాస్త్ర అధ్యాపకులు, మాట్లాడుతూ భార్గవగారు సి.సి.యం.బి స్థాపనలోనూ, అభివృద్ధి లోనూ కీలక పాత్ర వహించారనీ,వారి కృషి వైద్యరంగంలో పరిశోధన రంగంలో ఎంతో ఉపయోగపడిందని వివరించి చెప్పారు విజ్ఞాన దర్శిని ప్రధాన కార్యదర్శి నాగరాజు దంతెనపల్లి మాట్లాడుతూ మూఢ న మ్మకాలు, దురాచారాల ను ప్రశ్నించాలంటూ,బాబాల గుట్టు ఇదేనంటూ కొన్ని మ్యాజిక్ ప్రదర్శనల ద్వారా విద్యార్థులను పాల్గొనజేస్తూ వివరించారు.విజ్ఞాన దర్శిని కోశాధికారి బి.ప్రీతమ్ మాట్లాడుతూ పి.యం.భార్గవ లాగా సత్యం వైపే నిలబడాలని, స్వయంగా ప్రశ్నిస్తూ,ఆలోచించాలే తప్ప గాలివాటుగా గుడ్డి నమ్మకాలకు పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఎం.భార్గవకి జోహార్లు అర్పిస్తూ, శాస్త్రీయ దృక్పధంతో ముందుకెళతామని అందరూ ప్రతిన బూని మానవతా వాదులుగా మూఢ నమ్మకాలను వ్యతిరేకంగా శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవడమే పి.ఎం భార్గవకి నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిజి కళాశాల ప్రిన్సిపాల్ డా" రోజారాణి అధ్యాపకులు విజ్ఞానదర్శిని కార్యవర్గ సభ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

## సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి వినతిపత్రాన్ని అందించిన కాంగ్రెస్ పార్టీ నగర మైనార్టీ అధ్యక్షులు ఎస్.కె అబ్బాస్ బేగ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి:** స్వయం ఉపాధి-100% సబ్సిడీ రుణాలు ఖమ్మం ముస్లింలుపండ్లతోపు బండ్లు-పంక్చర్ దుకాణాలు ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన దయనీయ పరిస్థితిని చూసి తెలంగాణలో ఆయా జిల్లాలో మైనార్టీ ఉర్దూ మీడియం జూనియర్ డిగ్రీ కాలేజీలు ముఖ్యంగా ఖమ్మం జిల్లా కరీంనగర్ ఆదిలాబాద్ నల్గొండ జిల్లాలో ప్రాంతాల్లో పెట్టాలని కోరుకుని మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ చేస్తామని తెలిపి ఆన్లైన్ చేపించినా సంవత్సరం దాటినా వాటికోసం అందరూ ఎదురు చూస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఖమ్మం కార్పొరేషన్ లో (ఖమ్మం & భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు) ముస్లింలు చాలా వెనుకబడి ఉన్నారని తెలంగాణ సుధీర్ కమిటీలో కూడా ప్రస్తావించారని మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి చాలా ముస్లిం కుటుంబాలు తోపుడు బండ్లు,పంక్చర్ షాపులు మెకానిక్ దుకాణాలు సైకిల్ దుకాణాలు మొదలైన వాటి ద్వారా జీవనం సాగిస్తున్నారని ఆల్ ముస్లిం మైనారిటీల అభివృద్ధి & న్యాయ్ తో కలిసి ముస్లింల దయనీయ స్థితిపై చేసిన సర్వే గురించి తెలిపారు బడ్జెట్ కేటాయింపులో అత్యధిక వాటా ఖమ్మంకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వస్తే మైనార్టీ బతుకు మారతారని నమ్ముకున్నా కానీ ఇప్పటి దాకా ఏం మారలేదని దయచేసి వెంటనే వారికిచ్చిన హామీలను అమలు చేయాలని కోరుకుంటూ 100% సబ్సిడీ రుణాలు ఇచ్చి ఖమ్మం ముస్లిం మైనారిటీల అభివృద్ధి మరియు సాధికారత కోసం బడ్జెట్ను సక్రమంగా కేటాయించాలని అభ్యర్థిస్తూకాంగ్రెస్ పార్టీ, ఖమ్మం నగర మైనార్టీ అధ్యక్షుడు అబ్బాస్ బెగ్ మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు.

## బిసి బిల్లు సాధన కోసం

- 72 గంటల పాటు నిరాహార దీక్ష
- యుపిఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుంటి మంజులారాణి




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక బిసి బిల్లు సాధన కోసం ఆగష్టు 4,5,6,7 తేదీల్లో తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎంఎల్సి కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్లోని ఇందిరాపార్క్ వద్ద 72 గంటల పాటు నిరాహరదీక్షచేపడుతున్నట్లు యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుంటి మంజులారాణి పేర్కొన్నారు. ఖవుమ్మం జిల్లాలోని బిసిలంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఖమ్మంలోని ప్రెస్క్లబ్లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు.బిసి బిల్లు కోసం కవిత నేతృత్వంలో అంతా ఐక్యమై ఉద్యమించనున్నట్లు తెలిపారు.కవితక్క పోరాటాల ద్వారానే కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లుపై ఆర్డినెన్స్ తెచ్చినట్లు తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లో ముస్లింల శాతం ఎంతో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. రాష్ట్రంలో బిల్లు తెచ్చి కేంద్రంలో బిజెపితో రేవంత్రెడ్డి ప్రభుత్వం కలిసి డ్రామాలాడుతోందన్నారు. బిసిలోని ఉపకులాల వృధ్య తగాదా పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఇంకెన్నాళ్లు బిసిలను మోసం చేయాలని చూస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే 42 శాతం బిల్లును ఆమోదించాలన్నారు. రిజర్వేషన్లు ఇచ్చే వరకూ కవితక్క నేతృత్వంలో పోరాడతామన్నారు. రిజర్వేషన్లు ఖరారయ్యాకనే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలన్నారు.బిల్లు కోసం జరిగే 72 గంటల పాటు నిరాహారదీక్షలో బిసిలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.అనంతరం 72 గంటల నిరాహార దీక్ష పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకురాళ్లు ఎం.భారతి, జిల్లా నాయకురాలు గట్టు కరుణ, యూత్ ప్రెసిడెంట్ నాగేందర్, నేతలు ఉదయ్కిరణ్,వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## పాత మసీదు స్థలంలో షాదీఖానా నిర్మించండి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** ఖమ్మం నగరం 14వ డివిజన్ లోని గొల్లగూడెం బొడ్రాయి సెంటర్ లో ఇండ్లమధ్య నిర్మించబడిన పాత మసీదు స్థలంలో షాదీఖానా లేదా ఉర్దూ మదర్సా, లేదా కమ్యూనిటీహాల్ నిర్మించి ముస్లిం ప్రజలందరికి ఉపయోగపడేవిధంగా చేయాలని అదే గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్ ఆలీ కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహమ్మద్ ఆలీ మాట్లాడుతూ పాత మసీదులో నమాజ్ లు చేసుకోవడానికి సరిపడా స్థలంలేక ఇండ్ల మధ్యలో మా ఇంటిని ఆనుకొని ఉండడం వల్ల అసౌకర్యంగా ఉన్నదని భావించి గొల్లగూడెం ముస్లిం పెద్దలు, ముస్లిం ప్రజలు కలిసి అతిసమీపంలోనే కేవలం 150 అడుగుల దూరంలో నూతన మసీదు ఏర్పాటు చేసుకుని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు చేసుకుంటున్నారన్నారు.అదే గ్రామంలో ప్రార్థనల కొరకు మరొక మసీదు కూడా ఉందని తెలిపారు. కానీ సరైన స్థలం లేకపోయినా, ఇండ్లమధ్య ఇబ్బంది ఉంటుందన్నా కూడా పాత మసీదులో అనుమతి లేకుండానే మసీదు నిర్మాణం చేస్తున్నారు. ఇట్టి విషయం మసీదు కమిటీ, ముస్లిం పెద్దలకు తెలిపామన్నారు. భారీ శబ్దాలు, కొత్త వ్యక్తులు జమాతులుగా పదుల సంఖ్యలో భక్తి ప్రసంగాలు చేస్తుంటారు. వాటి ద్వారా చిన్న పిల్లలు, వృద్ధులు,అనారోగ్యంతో ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారని అడిగినందుకు దౌర్జన్యంగా మాట్లాడుతున్నారు,మా విన్నపాన్ని మన్నించడంలేదు,మాకు మనశ్శాంతి లేకుండా పోయిందని చివరికి,పోలీసులు,మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన స్పందన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుని పేరుతో ఇతరులను ఇబ్బంది పెట్టొద్దని వేడుకున్నారు. నిరుపేదలమైన మాకు ఈ ఇల్లు తప్ప వేరే ఇల్లు లేదు, ఇంటిని వదలి వెళ్లి వేరే చోట ఇల్లు కొనుక్కునే స్తోమతలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మసీదు నిర్మించుకోవాలంటే గొల్లగూడెం గ్రామం పక్కనే ఉన్న 72 ఎకరాల్లో వక్ఫ్ బోర్డు స్థలంలో విశాలమైన ప్రదేశంలో కూడా మసీదును నిర్మించుకోవచ్చన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

